ప్రజాశక్తి

బుధవారం 4 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

దళిత ఎస్ఐపై తప్పుడు ప్రచారం హేయం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రకాశం జిల్లా, మర్రిపూడి దళిత ఎస్ఐపై వైసీపీ తప్పుడు ప్రచారం దుర్మార్గమని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు ఆయన వెలగపూడి సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా మర్రిపూడి ఎస్సై ఎంక్వయిరీ కోసం కొండపి మండలం జాళ్లపాలెంలో వైసీపీ రౌడీషీటర్ ఇంటికి వెళ్లారని, ఆ రౌడీ షీటర్ కుటుంబ సభ్యులే ఎస్సై విధులకు అడ్డుపడి ఎస్సై తమపై దాడి చేసినట్టు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వాస్తవాలని వక్రీకరించి వైసీపీ నేతలు, బ్లూ మీడియా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నట్లు చెప్పారు. నిజాయతీగా పనిచేస్తున్న పోలీసులపై వైసీపీ తప్పుడు ప్రచారం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

రౌడీలకు, గూండాలకు కులాలు అంటగడతారా.?

రౌడీలకు, గూండాలకు కులాలు అంటగట్టి రాజకీయం చేస్తారా? గంజాయి బ్యాచ్‌పై పోలీసులు చర్యలు తీసుకోవడం తప్పా.? అని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రశ్నించారు. మంగళవారం నాడు తన నివాసంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు కోకొల్లలని, వారి హయాంలో ఏ ఒక్క బాధితుడినీ పరామర్శించని జగన్ నేడు గంజాయి బ్యాచ్‌ని పరామర్శించేందుకు రావడమేంటని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. నేరస్తులను ప్రోత్సహించి జగన్ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారు? అని పేర్కొన్నారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ని చంపిన పాపం మీది కాదా? అని ప్రశ్నించారు. జగన్ మాయమాటలు దళితులు నమ్మే పరిస్థితి లేదని, దళితుల అభివద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. జగన్ ఇకనైనా కుట్ర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

సిసి ఫుటేజి రగడ.!

- పోలీసు విధులకు ఆటంకం కలిగించడం తప్పే..: ఎస్పి
- ఎన్‌హెచ్‌సికి కొండలరావు ఫిర్యాదు
- రాజకీయ రంగు పులుముకున్న వ్యవహారం

సిసి ఫుటేజిలో రికార్డయిన తోపులాట..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కొండపి నియోజకవర్గంలోని పలు దేవాయాలలో దొంగతనం కేసుల విచారణలో భాగంగా సిసి ఫుటేజీ పరిశీలన రగడ తారాస్థాయికి చేరింది. పోలీసు విధులకు ఆటంకం కలిగించటం తప్పేనని, వారిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ ప్రకటించారు. మర్రిపూడి ఎస్సై తమపై దాడి చేసి వస్తువులు లూటీ చేశారని ఆరోపిస్తూ జాళ్లపాలెంకి చెందిన మారంరెడ్డి కొండలరావు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దళిత ఎస్ఐపై తప్పుడు ప్రచారం చేయడం హేయమని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. కొండలరావు కుటుంబాన్ని బుధవారంనాడు వైసిపి నేతలు పరామర్శిస్తారని సమాచారం. దీంతో ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది.

అసలేం జరిగిందంటే..

పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెంలో గత నెల 26న పోలేరమ్మ ఆలయంలో దొంగతనం జరిగింది. ఈ నెల 28న కొండపి మండలంలోని పెట్లూరు గ్రామ శివాలయంలో, జరుగుమల్లి మండలం ఎన్ఎన్ కండ్రిగ గ్రామంలోని పోలేరమ్మ గుడిలో మరో దొంగతనం జరిగింది. జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి డిఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మర్రిపూడి ఎస్సై రమేష్ బాబు, కానిస్టేబుళ్ళు గత నెల 28న సంఘటన జరిగిన ప్రాంతం, చుట్టుపక్కల ఉన్న వ్యాపార సంస్థలు, నివాసగృహాలకు చెందిన కీలకమైన సిసి కెమెరా ఫుటేజీని సేకరించడానికి పెట్లూరు నుండి జాళ్ళపాలెం వరకు కెమెరాలు చెక్ చేసుకుంటూ వెళ్లారు. జరుగుమల్లి ఎస్ఐ సిబ్బందితో ఎన్ఎన్ కండ్రిగ నుండి జాళ్ళపాలెం వైపు సిసి కెమెరాలు చెక్ చేసుకుంటూ వస్తున్నారు. మర్రిపూడి ఎస్ఐ జాళ్ళపాలెం గ్రామంలో మారంరెడ్డి కొండలరావు అనే వ్యక్తి షాప్ వద్ద రోడ్డు వైపు సిసి కెమెరా ఉండటంతో అక్కడ మహిళతో ఉన్నతాధికారుల ఆదేశాలతో వచ్చామని, దొంగతనాల కేసు విచారణలో భాగంగా సిసి ఫుటేజీ ఇవ్వాలని కోరారు. బండి చంద్రమ్మ అనే మహిళ తన అన్న మారంరెడ్డి కొండలరావును అడుగుతానని చెప్పటం, ఫోన్‌లో సంప్రదిస్తే కొండలరావు సిసి ఫుటేజీ ఇవ్వనని చెప్పటంతో పోలీసులు షాపులోకి వెళుతుండగా కొండలరావు వదిన కుమార్తె ఎస్సైను అడ్డుకుంది. ఎస్సై, మహిళ మధ్య వాగ్వివాదం చోటు చేసుకొని తోపులాట సిసి కెమెరాలో రికార్డు అయింది. మారంరెడ్డి కొండలరావు జరిగిన ఘటనపై ఈనెల 2న పోలీస్ స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్‌పికి

▶ 2లో

మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఏడాది పాలన ఎలా ఉంది.?



- సర్వే ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- 'సుపరిపాలనకు ఏడాది' అంటూ కూటమి నేతలు
- 'వెన్నుపోటు దినం' అంటూ వైసిపి నిరసన..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మీరు ఎవరికి ఓటు వేస్తారు.. మీరు కూటమి ప్రభుత్వానికి ఓటు వేస్తారా.? లేక వైసిపికి ఓటు వేస్తారా.?' అంటూ మంగళవారం జిల్లా అంతటా ఆన్‌లైన్ సర్వే విస్తృతంగా జరిగింది. నేటికి సరిగ్గా ఏడాది క్రితం విడుదల అయిన ఎన్నికల ఫలితాల్లో రాష్ట్ర ప్రజలు తమ ఓటు ద్వారా స్పష్టమైన తీర్పునిచ్చారు. ఐదేళ్ల వైసిపి పాలనకు తెరదించి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో చతికిలబడ్డ అభివద్ధిని మళ్లీ పరుగులు పెట్టించే విధంగా కూటమి పాలన సాగుతుందని టిడిపి నేతలు చెబుతూ సుపరిపాలనకు ఏడాది పేరుతో కూటమి విజయాన్ని పండగలా చేసుకుంటామని పిలుపునిచ్చారు. అయితే ఈ రోజును 'వెన్నుపోటు దినంగా' అభివర్ణిస్తూ వైసిపి నేతలు పిలుపునివ్వడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. గడిచిన మూడు రోజులుగా నియోజకవర్గాల వారీగా అధికార, ప్రతిపక్ష నేతలు వరుసపెట్టి మీడియా సమావేశాల్లో తమ వాదనలు వినిపిస్తూ వచ్చారు. ప్రతిపక్ష వైసిపి ఆరోపణలు ఎలా ఉన్నా, కూటమి ప్రభుత్వ నేతలు తమ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు.? ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మీరు ఎవరికి ఓటు వేస్తారు.? అంటూ ఆన్‌లైన్ సర్వే చేపట్టింది. ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి.. రానున్న కాలంలో ప్రజారంజకంగా ముందుకు సాగాలని కూటమి నేతలు భావిస్తున్నారు.

నేటికి సరిగ్గా ఏడాది క్రితం విడుదలయిన ఎన్నికల ఫలితాల్లో బాపట్ల పార్లమెంట్ స్థానంతో పాటు బాపట్ల జిల్లాలో ఉన్న ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టిడిపి అభ్యర్థులు మంచి మెజారిటీలతో గెలుపొందారు. జిల్లా నుంచి పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు, అనగాని సత్యప్రసాద్ హాట్రిక్ విజయాలు సాధించారు. అనగాని మంత్రి అయ్యారు. ఐదో పర్యాయం ఎమ్మెల్యేగా గెలుపొందిన గొట్టిపాటి రవికుమార్ మంత్రి అయ్యారు. వేమూరు నుంచి నక్కా ఆనంద బాబు మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. బాపట్ల, చీరాల నుంచి వేగేశన నరేంద్రవర్మ రాజు, మద్దులూరి మాలకొండయ్య మొదటి సారి ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. గడిచిన ఏడాది కాలంలో తమను ఎన్నుకున్న ప్రజల అభీష్టం మేరకు పనులు జరిగేలా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ వంతు కృషి చేశారు. జిల్లాని అభివృద్ధి పథంలోకి తీసు కెళ్లేందుకు శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించారు. మూడు పర్యాయాలు

▶ 2లో

ఖాళీ జాగా కాజేసే యత్నం.!

- ఎబిఎం స్థలంపై నేతల కన్ను.!
- అధికారులపై ఒత్తిళ్లు
- సెలవులో వెళ్లిన సబ్ రిజిస్ట్రార్.!

ఎబిఎం కాంపౌండ్‌లో ఉన్న భూమి..

ప్రజాశక్తి-మార్కాపురం

ఖాళీ జాగా కనబడితే చాలు... దానిని ఎలాగైనా కాజేయాలనే దురాలోచనలో కొందరు రాజకీయ నాయకుల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎబిఎం స్థలాలపై కొంత కాలంగా పలు వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. మార్కాపురం పట్టణంలోని ఎన్ఎస్ నగర్‌లో ఉన్న ఎబిఎం కాంపౌండ్‌లో 80 సెంట్ల విస్తీర్ణం కలిగిన సుమారు రూ.11 కోట్ల విలువైన స్థలాన్ని కాజేసేందుకు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. కానీ అందుకు అధికారులు భయంతో సహకరించకపోవడంతో ప్రస్తుతం మరో నాటకీయ పరిణామానికి తెర తీసినట్లు తెలుస్తోంది.!

మార్కాపురం పట్టణంలోని బాప్టిస్ట్ మిషన్ ఆస్తులను నాదెళ్ల సుబ్రమణ్యం, హనుమాన్ రియల్ ఎస్టేట్ తరపున నాదెళ్ల నాగవేణి కలిసి 30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు. అప్పట్లో వీరికి అమ్మిన వ్యక్తులు ఈ స్థలాన్ని రిజస్ట్రేషన్ చేయటం జరిగింది. ఆ తరువాత ఎన్నో వివాదాలు, కోర్టు కేసులు నడిచాయి. కొందరు మాత్రం 'ఎబిఎం ఆస్తులను కాపాడండి' అంటూ ప్రతి గ్రీవెన్స్ లోనూ అర్జీ ఇవ్వడం పరిపాటిగా మారింది. వీటిపై తమకు హక్కులు ఉన్నాయని ఇటీవల కొందరు మళ్ళీ వివాదం లేపుతున్నారు. గతంలో ఆయనకు అమ్మిన అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ సొసైటీ (ఎబిఎఫ్ఎస్) వాళ్ల తమకు హక్కులు కల్పించి రాసి ఇచ్చారని ఇప్పుడు కొత్తగా ఏర్పడిన సొసైటీ వ్యక్తులు చెబుతున్నారు. 1973లోనే మేము సొసైటీగా ఏర్పడ్డామని వారు చెబుతుండగా... 50 ఏళ్లుగా లేని సొసైటీ ఇప్పుడు ఎలా వచ్చిందని ఆస్తులు కొనుగోలు చేసిన వాళ్లు ప్రశ్నిస్తున్నారు. డబ్బు చెల్లించి అధికారికంగా చట్టబద్ధంగా రిజస్ట్రేషన్ చేసిన ఆస్తులపై ఇప్పుడు వివాదం ఏమిటని నాదెళ్ల సుబ్రహ్మణ్యం

▶ 2లో

శ్యామల కాశిరెడ్డికి పారిశ్రామికవేత్తల సన్మానం

ప్రజాశక్తి-వెలిగండ్ల

శ్యామల కాశిరెడ్డి ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ అధ్యక్షునిగా నియమితులై సోమవారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బొంబాయికి వెళ్లిన ఆయనకు ప్రముఖ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలు మంగళవారం శ్యామల కాశిరెడ్డి కార్యాలయంలో సునీల్ సావంత్ ఆదాని గ్రూప్, ప్రశాంత్ పాండే గోద్రెజ్ గ్రూపు ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన దాదాపు 25 ఏళ్లుగా ముంబైలో పలు కంపెనీ స్థాపించి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఈ సందర్భంగా వారు ఇటు రాజకీయంగా వ్యాపారపరంగా ఉన్నత స్థాయికి ఎదిగిన కాశిరెడ్డిని ఘనంగా సన్మానించడం జరిగింది. పారిశ్రామికవేత్తలు డిసిఎంఎస్ అధ్యక్షుడు శ్యామల కాశిరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

శ్యామల కాశిరెడ్డిని సన్మానిస్తున్న పారిశ్రామికవేత్తలు

ఖాళీ జాగా కాజేసే యత్నం.!

(మొదటిపేజీ తరువాయి)

వాదిస్తున్నారు.

ఇటీవల చెన్నై కోర్టు నిర్ణయం

ఇటీవల మద్రాస్ హైకోర్టు ఎబిఎం ప్రాపర్టీస్ వివాదాలపై ఒక ఆర్డర్ జారీ చేసింది. సిఎస్ నెంబర్ 124/1994, 3863 ఆఫ్ 2024, 5144, 7395 ఆఫ్ 2018, 5753, 5755 ఆఫ్ 2024లకు 2024 డిసెంబర్ 19వ తేదీన మద్రాస్ హైకోర్టు ఒక తీర్పు వెల్లడించింది. ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చస్, ది సమావేశం తెలుగు బాప్టిస్ట్ చర్చెస్, అమెరికన్ ఫారిన్ బాప్టిస్ట్ మిషన్ సొసైటీల మధ్య నెలకొన్న వివాదాలపై అసలు హక్కుదారులు ఎవరు? వారికి ఎలా సంక్రమించింది? ప్రస్తుతం హక్కుదారులు అని చెప్పుకుంటున్న వారి వద్ద ఉన్న ఆధారాలు ఏంటి.? అనే అన్ని విషయాలపై సమగ్రంగా విచారణ జరిపింది. త్వరలోనే కోర్టు ఆధ్వర్యంలోనే ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని రకాల వివాదాలు ఆ కమిటీ పరిధిలోనే నిజ నిర్ధారణ చేసుకొని పరిష్కరించుకోవాలని సూచించటం కూడా జరిగింది. ఈ కారణంగా ఈ ఆస్తులపై ఎవరికి హక్కు ఉంది? అని తేల్చాల్సింది కోర్టు పరిధిలోని కమిటీ మాత్రమే!

కానీ ఇటీవల ఈ భూములపై కన్నేసిన బడా రాజకీయ నాయకులు ఎలాగైనా వాటిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తూ... ఈ ఖాళీ జాగాను వేకంట్ ల్యాండ్ కింద చూపుతూ మున్సిపల్ అధికారుల ద్వారా పన్ను వేయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీన్ని ఆధారం చేసుకుని రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇతరుల కింద ఉన్న భూమి తమకు సంక్రమించినట్లు ఎబిఎఫ్ వాళ్ళనే హక్కుదారులుగా చూపుతూ రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. కానీ కోర్టు పరిధిలో ఉన్న ఇటువంటి వాటి విషయంలో జోక్యం చేసుకుంటే ఇబ్బందులు పడతామనే భయంతో ఇక్కడి సబ్‌రిజిస్ట్రార్ కూడా సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. ఇదే అదునుగా భావించిన కబ్జాదారులు తమకు అనుకూలంగా ఉండే రిజిస్ట్రార్‌ను ఇన్చార్జిగా రప్పించి ఆ పని పూర్తి చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇలాంటి సమయంలో అధికారులు ఇబ్బంది పడుతూ... దురాలోచన కలిగిన వారి ప్రయత్నాలను బహిరంగంగానే విమర్శించడం గమనార్హం.

పంట సాగుహక్కు పత్రాలపై అవగాహన

ప్రజాశక్తి-పీసీపల్లి: పంట సాగు హక్కు పత్రాలపై బుధవారం వ్యవసాయ శాఖ అధికారి కె.ప్రకాష్ రావు ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ సిహెచ్ ఉషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ పంట సాగుచేసే భూ యజమానులకు సమానంగా కౌలు రైతులకు కూడా పథకాలు వర్తిస్తాయన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇప్పించేలా కృషి చేయాలన్నారు. మండలానికి 1279 కార్డులు చేయాలని లక్ష్యం నిర్దేశింపబడినట్లు తెలిపారు. రైతులు ఈ కౌలు కార్డులు పొంది సద్వినియోగం చేసుకోవాని సూచించారు.

ఏడాది పాలన ఎలా ఉంది.?

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా అభివృద్ధి మండలి సమావేశాలు జరిపారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. పంట కాలువలు, మురుగు కాలువల మరమ్మతుల కోసం నిధులు విడుదల చేశారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు జరిపారు. జిల్లాలోని గ్రామాల్లో అన్ని వర్గాల వారికి సంక్షేమ, అభివృద్ధి పనులు చేరేలా కృషి చేస్తున్నామని మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్నారు. వైద్యసేవల కోసం మెడికల్ కళాశాల పనులు చేపట్టాల్సి ఉంది. నిజాంపట్నం, చీరాల ఫిషింగ్ హార్బర్లను పూర్తి చేయాలి. ఆక్వాపార్కు పనులు చేపట్టాలి. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు గానీ ఇందుకు తగిన విధంగా నిధుల లభ్యత లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు దండిగా నిధులు తేవడం ద్వారా తమను ఎన్నుకున్న ప్రజల మన్ననలు పొందేలా ఎమ్మెల్యేలు కృషి చేయాల్సి ఉంది.

సిసి ఫుటేజి రగడ

(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు.

పోలీసు విధులకు ఆటంకం తప్పే..

ఎస్‌పి ఏఆర్ దామోదర్

కేసుల విచారణలో భాగంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించటం తప్పేనని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఎస్‌పి మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలోని పలు దేవాలయాలలో దొంగతనాలు జరగటంతో తన ఆదేశాల మేరకు పోలీసు అధికారులు సిసి కెమెరాలను పరిశీలించటం, సిసి ఫుటేజీ సేకరిస్తున్నారన్నారు. జరుగుమల్లి మండలం జాళ్ళపాలెం గ్రామానికి చెందిన మారంరెడ్డి కొండలరావు షాపులో సిసి కెమెరా ఉండటం, సిసి ఫుటేజీ కావాలని అడగటం, అతని చెల్లెలు బండి చంద్రమ్మ అనే మహిళ తన అన్న కొండలరావును ఫోన్ లో సంప్రదించగా మారంరెడ్డి కొండలరావు పోలీసులకు ఉపయోగపడే ఏ విషయంలో కూడా నేను సహకరించనని చెప్పారన్నారు. పోలీసులకు ఉపయోగపడే సమాచారం సిసి కెమెరా ఫుటేజ్‌లో ఉంటే డిలీట్ చేస్తానని, డివిఆర్, మానిటర్‌ను తగలబెడతానని పోలీసులకు ఇవ్వనని చెప్పారన్నారు. కేసు విచారణలో భాగంగా దొంగతనంకి సంబంధించిన సమాచారాన్ని డిలీట్ చేస్తాడేమోనని సిసి కెమెరా, మానిటర్‌ను పరిశీలించేందుకు లోపలికి వెళుతుండగా కొండలరావు చెల్లెలు చంద్రమ్మ లోపలికి పోనివ్వనని మద్రిపూడి ఎస్ఐను పదే పదే నెట్టిందన్నారు. ఈ సందర్భంలో మద్రిపూడి ఎస్ఐ ఆ మహిళను పక్కకి నెట్టి లోపలికి వెళ్తుండగా కొండలరావు వదిన కూతురు ఆదిలక్ష్మి విధుల్లో ఉన్న మద్రిపూడి ఎస్ఐను అడ్డగించిందన్నారు. జరిగిన ఈ సంఘటన వీడియోను మారంరెడ్డి కొండలరావు ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో పెట్టి పోలీసులను అప్రతిష్టపాలు చేశారన్నారు. విధులలో ఉన్న పోలీసులను అడ్డుకున్నందుకు కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్‌పి తెలిపారు. మారంరెడ్డి కొండలరావుపై రౌడీ షీట్‌తో పాటు పలు స్టేషన్‌లలో 8 కేసులు నమోదు అయ్యాయన్నారు. గతంలో ఆర్టీసి కండక్టర్‌గా కొండలరావు విధులు నిర్వర్తించారన్నారు. 2014లో కొండలరావు విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో ఆర్టీసి అధికారులు సస్పెండ్ చేశారన్నారు. నేరాల పరిశోధనలో సిసి కెమెరా ఫుటేజీ ఎంతో కీలకమైందని, జిల్లాలోని పౌరులందరు, వ్యాపార యజమానులకు పోలీసులకు సహకరించడం పౌర, చట్టపరమైన బాధ్యతని జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు.

ఎన్‌హెచ్‌సిలో కొండలరావు ఫిర్యాదు

ప్రకాశం జిల్లా మద్రిపూడి స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ రమేష్ బాబు పై జాతీయ మానవ హక్కుల కమిషన్ వద్ద ఫిర్యాదు నమోదయింది. మే 28వ తేదీ మద్రిపూడి ఎస్సై రమేష్ బాబు తన సిబ్బందితో ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి రక్తసంబంధీకులైన మహిళలు పిల్లలపై దాడి చేయడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించి మొబైల్, సీసీటీవీ డివైస్ పరికరాలను దౌర్జన్యంగా లూటీ చేశారని ఈ వ్యవహారంపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ మారంరెడ్డి కొండలరావు మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్ స్వీకరించింది.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 588/2024

బండి వెంకటస్వామి .. వాది

వర్సస్

గూడూరి కాశీనాథ ఆచారి .. ప్రతివాది

To,

గూడూరి కాశీనాథ ఆచారి
తండ్రి పెద్ద బ్రహ్మయ్య,
40 సం.లు, వయస్సు, హిందు,
బి.యస్.యఫ్.కానిస్టేబుల్, యన్.బయనపల్లె
గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ:10-07-2025న ఉదయం గం. 10:30 ని.లకు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 03-06-2025 **ఇట్లు**

శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,
వాదిపరం అడ్వకేట్,
గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 351/2024

గుర్రపుశాల రాజలీలావతి .. వాది

వర్సస్

సలిజామల హరి వగైరాలు .. ప్రతివాదులు

To

1వ ప్రతివాది

సలిజామల హరి తండ్రి వెంకటయ్య,
హిందు, 46 సం.లు, డాక్టర్, ఇడమకల్లు గ్రామం,
కొమరోలు మండలం,
ప్రస్తుతం : న్యూరో డాక్టర్,గవర్నమెంట్
హాస్పిటల్(రిమ్స్), గోపాల్ నగర్, 5వ లైను,
భాగ్యనగర్,ఒంగోలు,ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది దావా షెడ్యూలు ఆస్థులను అనుభవించుకొనుటలో నీ వగైరాలు ఆటంక ఆక్షేపణలు చేయకుండా పర్మినెంట్ ఇంజక్షన్ పరిహారము వగైరాలు పొందగోరి దావాను దాఖలు చేసియున్నది. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ 01-07-2025న ఉదయం గం.10:30 ని.లకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 03-06-2025 **ఇట్లు**

శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,
వాదిపరం అడ్వకేట్,
గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. 450/2024
in
O.S. 351/2024

గుర్రపుశాల రాజలీలావతి ..పిటిషనర్ / వాది

వర్సస్

సలిజామల హరి వగైరాలు
.. రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To

1వ రెస్పాండెంటు/1వ ప్రతివాది

సలిజామల హరి తండ్రి వెంకటయ్య,
హిందు, 46 సం.లు, డాక్టర్, ఇడమకల్లు గ్రామం,
కొమరోలు మండలం,
ప్రస్తుతం : న్యూరో డాక్టర్, గవర్నమెంట్
హాస్పిటల్(రిమ్స్), గోపాల్ నగర్, 5వ లైను,
భాగ్యనగర్,ఒంగోలు,ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటిషన్ లోని పిటిషనర్/ వాది దావా షెడ్యూలు ఆస్థులను అనుభవించుకొనుటలో నీ వగైరాలు ఆటంక ఆక్షేపణలు చేయకుండా ఇంటరిమ్ ఇంజక్షన్ వగైరా పరిహారములు పొందగోరి పిటిషన్ ను దాఖలు చేసియున్నది. సదరు పిటిషన్ లో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ01-07-2025న ఉదయంగం. 10:30 ని.లకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 03-06-2025 **ఇట్లు**

శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,
పిటిషనర్ /వాదిపరం అడ్వకేట్,
గిద్దలూరు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో ఒంగోలు

G.W.O.P.NO 21/2025

Between

నల్లమల్లి సౌజన్య దేవి ...పిటీషనరు

వర్సెస్

నల్లమల్లి రామ్‌కుమార్ ...రెస్పాండెంట్

నల్లమల్లి సాయిస్మరణ్ మరియు నల్లమల్లి సాయి సుకేష్‌లకు తను గార్డెయన్ అని నల్లమల్లి సౌజన్య దేవి పై నెంబర్ పిటిషన్ దాఖలు చేసి మైనర్లైన సాయిస్మరణ్ సాయిసుకేష్‌ల పేరున ఉన్న షెడ్యూలు దాఖలా ఆస్తిని మైనర్ల విద్యా మరియు ఇతర అవసరములకు నిమిత్తం విక్రయించుటకు అనుమతి కోరి ఉన్నారు కాన సదరు అనుమతిని ఇచ్చుటకు ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల తేదీ 17-06-2025న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు

షెడ్యూల్

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్- ఒంగోలు సబ్ రిజిస్ట్రేషన్- ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్- పోతురాజుపాలెం అన్నవరప్పాడు - ఆరవ వార్డు హ ఆరో బ్లాకు సర్వే నెంబరు105, ప్లాట్ నెంబరు 87, తూర్పు 45 గదులు 13చ.అడుగులు ఖాళీ స్థలమునకు హద్దులు

తూర్పు : 40 అడుగుల రోడ్డు
దక్షిణం : 40 అడుగుల రోడ్డు
పడమర : ప్లాట్ నెంబర్ 87 తాలూకు మిగిలిన స్థలం
ఉత్తరం : గప్లాట్ నెంబర్ 88

ఈ హద్దులలోని 3250 చ.అ. స్థలం లేదా 361.1 చ.గ.ల.స్థలం

// పై కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఇట్లు

నరసింగోలు శ్రీనివాస్ ప్రసాద్
C.శివకుమార్,
బి.లక్ష్మీనారాయణ
అడ్వకేట్స్
పివిఆర్ హైస్కూల్ పక్కన, ఒంగోలు

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపుల్ జడ్జి వారి కోర్టులో

GWOP No.9/2025

బిట్వీన్ :

సరిమిశెట్టి శ్రీలక్ష్మి .... పిటీషనర్

వర్సెస్

నిల్ ...రెస్పాండెంట్స్

పై నంబరు కేసులో పిటీషనర్ తన మైనర్ కుమార్తె బేదంశెట్టి మౌనిక తండ్రి లేటు వేణుగోపాల్ మరియు బేదంశెట్టి నరసింహ సాయినిషాంత్ తండ్రి లేటు వేణుగోపాల్ అను వారి పేర్లునగల పిటిషన్ షెడ్యుల్డ్ ఆస్థిని మైనర్లలాభాపేక్ష కోరుతూ విక్రయించుటకు పైకోర్టునందు పర్మిషన్ ఇప్పించ వలసినదిగా పిటిషన్ దాఖలు చేయగా సదరు పిటిషన్ తేది.25-06-2025కు వాయిదా ఉన్నది. అందుపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట తేది. 25-06-2025 న ఉదయం 10.30ని.లకు స్వయముగా గాని లేదా ప్లీడర్ గారిద్వారా గాని హాజరై తమ అభ్యంతరములు తెలియపరచవలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ ఒంగోలు సబ్ రిజిస్ట్రేషన్-ఒంగోలు మండలం-వెంగ ముక్కల పాలెం గ్రామా పంచాయితి-వెంగముక్కపాలెం గ్రామ సర్వే నెం.20/8 లోని య.1-19 సెంట్లలోని య.59.5 సెంట్లు మెట్టభుమికి హద్దులు.

తూర్పు : ముప్పరాజు జయమ్మగారివ్యవసాయభూమి
దక్షిణం : తారు రోడ్డు కొంతవరకు, బబ్బారి బ్రహ్మయ్య గారి వ్యవసాయ భూమి కొంతవరకు
పడమం : మక్కెన వెంకటేశ్వర్లుగారివ్యవసాయభూమి
ఉత్తరం : ముప్పరాజు జయమ్మ, మక్కెన కృష్ణయ్య గార్ల వ్యవసాయ భూమి

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు

సయింపు వెంకట మల్లిఖార్జునరావు
పేరాబత్తిన బ్రహ్మయ్య
ఏ.రవి కుమార్, డి.సుకన్యా దేవి
సయింపు ప్రదీప్ చంద్ర చౌదరి
న్యాయవాదులు,
గోల్డెన్ టవర్స్ జిల్లా కోర్టు ఎదురు ఒంగోలు,
ప్రకాశం జిల్లా.
సెల్ : 9848240802

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి : డిఇ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రతి గ్రామాన్ని ఓ యూనిట్‌గా తీసుకొని విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కషి చేస్తున్నట్లు ఒంగోలు విద్యుత్ డిఇ మాకినేని హరిబాబు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వినియోగదారులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే అధికారులు దష్టికి తీసుకొస్తే వాటిని సత్వరం పరిష్కరించే విధంగా కషి చేస్తామన్నారు. కొత్త ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త స్తంభాలు ఏర్పాటు లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదాలు సంభవించే రోడ్డు జంక్షన్ ప్రాంతాలలో పెద్ద పోల్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపులోడు క్రమబద్ధీకరించుకోవడానికి 50 రాయితీతో ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజక వర్గంలో పదివేల సోలార్ యూనిట్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 200 యూనిట్లకు పైగా వాడకం ఉన్న గృహ వినియోగదారులు సోలార్ పథకాన్ని ఉపయోగించుకుంటే మంచిదన్నారు. గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు కొత్రగడ్డ రమణయ్య మాట్లాడుతూ పాలిషింగ్ యూనిట్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. మాటిమాటికి విద్యుత్తు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. టిడిపి నాయలు గొల్లపూడి కోటేశ్వరరావు, గొల్లపూడి సుబ్బారావు, కందిమళ్ల గంగాధర్ రావు మాట్లాడుతూ చీమకుర్తి పట్టణంలో ఆయా ప్రాంతాలలో లోవాల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన విద్యుత్ డిఇ హరిబాబు మాట్లాడుతూ చీమకుర్తి మండలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీ మోహన్ రావు, ఎఇలు వి శ్రీనివాసరావు, చంద్రశేఖర్, మాజీ సర్పంచి కూరాకుల కరుణాకర్ రెడ్డి, రావిపాటి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, గోగినేని శ్రీనివాసరావు, పాలడుగు వెంకట్ నారాయణ, విద్యుత్తు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యుత్ డిఇ హరిబాబు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బిఎస్ఎఫ్ జవాన్ మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రదీప్ కుమార్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బిఎస్ఎఫ్ జవాన్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శింగరాయ కొండ మండలం పాకల గ్రామానికి చెందిన బిఎస్ఎఫ్ జవాన్ పొందూరి ప్రదీప్ కుమార్(28) ఇటీవల ఒంగోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయ పడ్డారు. గత పది రోజులుగా కోమాలో ఉన్నాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. గత నెలలో యుద్ధం సమయంలో జిల్లాకు జవాన్ మతి చెందాడు. ఆ జవాన్ మృతదేహం తీసుకొని ఇక్కడకు వచ్చాడు. తర్వాత సెలవులో ఉన్న మరి వ్యక్తితో కలిసి మోటార్ బైక్ మీద వెళుతుండగా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రదీప్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రదీప్ కుమార్ మతి పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బిఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ దేశానికి సేవలందించిన ప్రదీప్ కుమార్ మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు. పాకల గ్రామంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పంపిణీకి పాఠ్యపుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : ప్రభుత్వ/ప్రభుత్వ అనుబంధ కళాశాలలలో 2025-2026 విద్యా సంవత్సరం జూనియర్, సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి కొండపల్లి ఆంజనేయులు, ఆర్ఐఒ ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. పాఠ్యపుస్తకాలు మంగళవారం ఒంగోలుకు చేరినట్లు వారు తెలిపారు. జిల్లాలోని 71 కళాశాలలో 24 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 6 మోడల్ కాలేజీలు, 28 కెజిబివి కళాశాలలు, 13 హైస్కూల్ అనుబంధ కళాశాలల లో అభ్యసించే విద్యార్థిని, విద్యార్థులకు అవసరమైన 4500 పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కొండపి

మలేరియా నివారణ మనందరి బాధ్యత అని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అనూష తెలిపారు. మలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా మలేరియా పై అవగాహన కలిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా వల్ల చలి,వాంతులు,వణుకు తో కూడిన జ్వరం వస్తుందన్నారు. దోమ కుట్టిన ఎనిమిది నుంచి 12 రోజులలో ఈ లక్షణాలు బయట పడతాయని తెలిపారు. వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.లక్ష్మీ నరసింహ, కాంతారావు ఆశా వర్కర్లు ఎఎన్ఎంలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ అనూష, వైద్యసిబ్బంది

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి పొందూరు గ్రామానికి చెందిన రైతులు 609 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 470 బేళ్ళు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 139 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర రూ.231.16పైసలు పలికింది.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు, రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 800 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 650 బేళ్ళుఅమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 150 బేళ్లను తిరస్కరించారు.కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280, కనిష్ట ధర రూ.200 సరాసరి ధర రూ.259.23 పైసలు పలికింది.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ సైకిల్ ఒకప్పుడు సామాన్యుడి విమానంగా, రెక్కల గుర్రంగా ఉపయోగ పడిందన్నారు. 2000వ సంవత్సరం వరకూ గ్రామాలు, పట్టణాల్లో విద్యార్థులు మొదలు, ఉద్యోగులు, వద్దుల జీవితంలో సైకిల్ ముఖ్య భాగంగా ఉందన్నారు. సైకిల్ శారీరక వ్యాయామానికి ఉపకరిస్తుందన్నారు.పైసా ఖర్చు లేకుండా కొండంత ఆరోగ్యం అందించే సైకిల్ మోటారు వాహనాల వినియోగంతో కనుమరుగైందన్నారు. ప్రతి ఒక్కరూ బైకులు,కార్లు,స్కూటీలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కాల కిరణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైకిలో ర్యాలీలో పాల్గొన్న మారెళ్ల సుబ్బారావు

భోజనం ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు :టంగుటూరు మండలం, ఆలకూరపాడు గ్రామానికి చెందిన దివి హరిబాబు పుట్టిన రోజు సందర్భంగా రోడ్ల వెంబడి ఉంటున్న అనాధలు, వృద్ధులు, మానసిక వికలాంగులకు మంగళవారం భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఆలకూరపాడు మాజీ ఎంపిటిసి బ్రాహ్మణకాక వేణు ఆధ్వర్యంలో భోజనం పొకెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. తొలుత దివి హరిబాబుకు యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనాధల ఆకలి తీర్చేందుకు ముందుకొచ్చిన బ్రాహ్మణకాక వేణుకు ఆర్గనైజేషన్ తరపున అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పంగులూరు

ఆగి ఉన్న లారీని బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాగర్లమూడి వారి పాలెం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అద్దంకిలోని ఎస్‌బిఐ కాలనీకి చెందిన గుంటూరు శ్రీనివాసరావు (60) మృతిచెందాడు. మృతుడు మార్టూరు నుంచి బైక్‌పై అద్దంకి వస్తున్నాడు. అదే సమయంలో డీజిల్ అయిపోవడంతో ఘటనా స్థలం వద్ద లారీ ఆగిఉంది. శ్రీనివాసరావు వెనుక నుంచి లారీని ఢీకొన్నాడు. దీంతో ఆయన అక్కడిక్కడే మృతిచెందాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇంట్లో వంట చేస్తున్న సమయంలో మంటలు చెలరేగడంతో ఓ పూరిల్లు దగ్ధమైంది. ఈఘటన యర్రగొండపాలెంలోని గాయత్రి సినిమా హాలు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పోలేపల్లి వెంకటేష్‌కు చెందిన పూరిళ్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. పొదుపు సంఘం నుంచి తీసుకున్న రూ.80,000 నగదు, బంగారం, బియ్యం, గ్యాస్ సిలిండర్, ఇంటిలోని వస్తువులు మంటల్లో కాలి బూడిదైనట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిబూడిదైంది.

లిబరేషన్ కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ గా చిటితోటి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : లిబరేషన్ కాంగ్రెస్ ఒంగోలు నియోజకవర్గ కన్వీనర్‌గా చిటితోటి శోభన్ బాబు ను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఐఎఎస్ అధికారి జివిఎస్ఆర్ కెఆర్. విజయకుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఒంగోలు నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని విజయ కుమార్ సూచించారు.

శనగలు కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి-మద్దిపాడు

రైతులు పండించిన శనగలను ఫ్లిప్‌కార్ట్‌ద్వారా కొనుగోలు చేస్తారని రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్‌లు బి.శ్రీనివాస్, వెంకట్రావు తెలిపారు. మండల పరిధిలోని నాగన్నపాలెం, ఇనమనమెల్లూరు గ్రామాల్లోని రైతులు వద్ద ఉన్న శనగలను మంగళవారం ఫ్లిప్ కార్ట్ యాజమాన్యంతో కలిసి వారు పరిశీలించారు. శనగలలో తేమ శాతాన్ని పరిశీలించి నాణ్యమైన శనగలను కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులకు అనుకూలమైన ధర చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లిప్‌కార్ట్ సీనియర్ క్వాలిటీ మేనేజర్ దివాకర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డేవిడ్, డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కాకుమాను సుబ్బారావు, ఎఫ్‌పిఒ సిసి ప్రేమానందం, ఎఫ్‌పిఒ ఎపిఎం నారాయణ,పాల్గొన్నారు.

శనగలను పరిశీలిస్తున్న అధికారులు

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - మద్దిపాడు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని వెల్లంపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. హైదరాబాదు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు వెల్లంపల్లి వద్దకు వచ్చేసరికి రాంగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. దీంతో బైకుపై ఉన్న నల్లూరి కష్ణారావు గాయపడ్డాడు. క్షతగాత్రుడికి ఆస్పత్రికి తరలించారు

మంత్రి జనార్దనరెడ్డితో మాట్లాడుతున్న ఏలూరి సాంబశివరావు

పోర్టు నిర్మించండి

ప్రజాశక్తి - చిన్నగంజాం, కారంచేడు

చిన్నగంజాం సముద్ర తీర ప్రాంత అభివృద్ధికి గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ షిప్ మేకింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. మంత్రితో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పోర్టులు, షిప్పింగ్ హార్బర్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని, పోర్టు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నగంజాం తీర ప్రాంతం లాజిస్టిక్స్, షిప్ మానుఫాక్చరింగ్‌కు అనువైన ప్రదేశమని వివరించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందని చెప్పారు. భౌగోళికంగా పోర్టు నిర్మాణానికి చినగంజాజం ప్రాంతం అనువుగా ఉండటంతోపాటు సముద్ర రవాణా అభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. కేంద్ర స్థాయిలో ముందుకు తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. కుంకలమర్రు, కారంచేడు బ్రిడ్జి నిర్మాణానికి, రహదారుల మరమ్మత్తులకు నిధులు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

'రోటరీ' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నాగులపాలెం వాటర్ ప్లాంటులో పనిచేస్తున్న అభిరాంకు రూ.90వేల ఆర్థిక సహాయం రోటరీ సభ్యుల సహకారంతో మంగళవారం అందజేశారు. ఇటీవల మరణించిన పోట్రు హరిబాబు, అతని కుమారుడు మణి కంఠ చౌదరి ఒకేసారి మరణించిన కారణంగా హరిబాబు కుమారుడైన అభిరాం పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాగులపాలెం రోటరీ గంగలో పనిచేయుచున్న కారణంగా రోటరీ సభ్యులు సమకూర్చిన రూ.90వేలను ఆ కుటుంబ సభ్యులకు విరాళంగా అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, తేళ్ల రమేష్ చంద్ర, నాగుబడి సుబ్బారావు, నాగు బైరు శ్రీనివాసరావు, కెఎస్ఆర్‌కె ప్రసాద్, కొల్లా నరేంద్ర, పాబోలు ఉదయభాస్కర్, కాసా అశోక్ కుమార్, కారుమూడి సుబ్బారెడ్డి, పాబోలు వెంకటేశ్వర్లు, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, కోట శ్రీనివాసరావు, ఉప సర్పంచి అడ్డగడ రామకృష్ణ, అడ్డగడ్డ చిన్న నాగేశ్వరరావు, కొల్లా భాస్కరరావు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

ఉచిత 'కుట్టు శిక్షణ'

ప్రజాశక్తి - కారంచేడు

మహిళల ఆర్థికంగా ఎదగడానికి ఉచిత కుట్టు శిక్షణ ఉపయోగ పడుతుందని ఎంపిడిఒ నేతాజీ అన్నారు. స్థానిక సచివాలయంలో మహిళల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ ఎంపిడిఒ లింగిశెట్టి కృష్ణతో కలిసి సందర్శించారు. మహిళలు స్వయంగా తమ కాళ్ళపై తాము నిలబడే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసిన అనంతరం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లను పంపిణీ చేస్తుందని చెప్పారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని 5న ధర్నా

మాట్లాడుతున్న సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - పర్చూరు

ఈనెల 5న గుంటూరు జిపిఐ కార్యాలయం వద్ద చేయనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు నాయకులు సిహెచ్ గంగయ్య రైతులను కోరారు. గ్రామాల్లో రైతు సంఘం, కాంగ్రెస్ సంఘం ఆధ్వర్యంలో పర్చూరు, నాగులపాలెం, వీరన్నపాలెం, ఉప్పుటూరు, చెరుకూరు గ్రామాల్లో మంగళవారం రైతులతో మాట్లాడారు. సరైన ధర ఇవ్వకుండా, పాసులు ఇవ్వకుండా నాణ్యత పేరుతో మంచి పొగాకును కూడా పక్కన పడేస్తున్నారని అన్నారు. దీనివల్ల రైతుల ప్రాణం విల విల్లాడిపోతుందని అన్నారు. ఇళ్ల వద్ద అప్పుల వాళ్లు నిలదీయడం, కూలీల కూలీ డబ్బుల కోసం రోజూ అడగటం, అకాల వర్షాల నుంచి పంటను రాబోయే కాపాడుకోవడం, రానున్న ఏడాది పంట ఏమి వేయాలో అర్థం కాని పరిస్థితుల్లో రైతులు ఆవేదనతో ఉన్నారని అన్నారు. పి కొండయ్య, శ్రీనివాసరావు, శివయ్య, సత్యనారాయణ, కాసిం పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఈనెల 5న గుంటూరు విద్యానగర్లో జిపిఐ కంపెనీ కార్యాలయం ముందు చేయబోయే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు, పంగలూరు మండలాల్లో ప్రచారం చేశారు. కారంచేడు మండలం దగ్గుబాడులో రైతులతో మాట్లాడారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ కంపెనీలు మంత్రుల సమావేశంలో ఇచ్చిన హామీ నెరవేర్చకుండా మోసం చేశారని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చెప్పినా కొనుగోలు చేయని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

విజయనగరకాలనీకి అండర్ పాస్ సాధించాం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని విజయనగరం కాలనీ మీదగా నూతంగా నిర్మించిన పిడుగురాళ్ల, వాడరేవు జాతీయ రహదారి వద్ద అండర్ పాస్ నిర్మాణాన్ని ఎమ్మెల్యే కొండయ్య, అధికారులు, నాయకులు, గ్రామస్తుల సమిష్టి కృషితో సాధించగలిగామని ఎపి లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు తెలిపారు. కాలనీలో మంగళవారం పర్యటించిన ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీ వాసులకు దహన సంస్కారాలు చేసుకునేందుకు ఉన్న స్మశాన వాటిక మీదగా నూతన రహదారి నిర్మించడంతో స్మశాన వాటికకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. కాలనీకి అనుకొని ఉన్న స్మశాన వాటికకు హైవే కింద నుండి అండర్ పాస్ నిర్మించాలని గత కొంత కాలంగా ఉన్నత అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. టెండర్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని, అండర్ పాస్ నిర్మిస్తే టెండర్ రద్దు చేసి మరో టెండర్ పిలవాల్సి ఉంటుందని చెప్పి అండర్పాస్ నిర్మాణ అంశాన్ని విరమించుకోవాలని గ్రామస్తులకు హైవే అధికారులు చెప్పారని తెలిపారు. అయితే ఈ సమస్యను వదిలిపెట్టకుండా కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ, తహశీల్దారు దృష్టికి తీసుకువెళ్లి పట్టుబట్టి అండర్ పాస్ నిర్మాణాన్ని సాధించగలిగామని చెప్పారు. రాజకీయ పెద్దలతో పాటు, స్థానిక ఎమ్మెల్యే

మాట్లాడుతున్న లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్య రావు

గ్రామస్తులు విన్నవించిన సమస్యపై సానుకూలంగా స్పందించి తమ వంతు కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దారు గోపికృష్ణ, ప్రసాద్, ఉసురుపాటి సురేష్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిది నేరపూరిత చరిత్ర

తెనాలి వచ్చి గంజాయి బ్యాచ్‌ని పరామర్శించిన మాజీ సీఎం జగన్మోహన్ కూడా నేరపూరిత చరిత్ర కలిగిన వ్యక్తని మాణిక్యరావు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో అనేకమంది దళితులు, మైనార్టీలు హత్య చేయబడితే అప్పుడు జగన్ ఎందుకు పరామర్శలు చేయలేదని ప్రశ్నించారు. తాను రాజకీయంగా ఎదగటానికి తండ్రి మరణాన్ని, సీఎం పీఠం కోసం బాబాయ్ హత్యను అడ్డం పెట్టుకొని ముందుకొచ్చిన జగన్మోహన్ రెడ్డికి శవ రాజకీయాలు కొత్త కాదని విమర్శించారు.

విద్యారంగంలో నూతన ఒరవడి సృష్టిస్తాం

హారిజన్ స్కూల్ కరస్పాండెంట్ పి రవికుమార్

ప్రజాశక్తి - వేటపాలెం

విద్యా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తామని హారిజన్ పబ్లిక్ స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పొగడదండ రవికుమార్ తెలిపారు. మండలంలోని రామన్నపేట పంచాయితీ కొత్తకాలు బ్రిడ్జి వద్ద ఉన్న వినాయక స్వామి గుడి ఎదురు రోడ్డులోని సాయినగర్‌లో హారిజన్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియాతో సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, సామాన్య కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో పాఠశాల స్థాపించినట్లు తెలిపారు. విద్య అందరికీ అందుబాటు లో ఉండాలనే ఆశయంతో ముందుకు సాగుతామన్నారు. 35 ఏళ్లు తను ధర్మపత్ని హారిణి విద్యా రంగంలో ఉన్నట్లు వివరించారు. అనుభవంతో స్థానిక ప్రజల అభివృద్ధికి తోడ్పాటున అందించేందుకే పనిచేస్తున్నట్లు తెలిపారు. మూడెకరాల మామిడి తోట మధ్యలో ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణంలో ఏర్పాటు చేసిన పాఠశాల పిల్లలకు నేలతో, ప్రకృతితో మమేకమయ్యేలా కృషి చేస్తామని అన్నారు. విశాలమైన ఆట స్థలం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందించి మంచి పేరు తీసుకు వస్తామన్నారు. నేచర్‌తో పిల్లలు ఆత్మీయత పెంచుకోవాలని అన్నారు. కేవలం పుస్తకాలకే పరిమితమయ్యే విద్యకంటే, మంచి పౌరులుగా ఎదగేలా వారిని తీర్చి దిద్దడమే నిజమైన విద్యని పేర్కొన్నారు. హారిజన్ ప్రారంభం ద్వారా నాణ్యమైన, సమగ్రమైన, అందరికీ అందుబాటులో ఉండే విద్య అందించాలన్న దిశగా మరొక ముందడుగు వేసినట్టు చెప్పారు. స్కూల్ నూతన అధ్యాపక బృందాన్ని మీడియాకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ పి హారిణి, మేనేజింగ్ డైరెక్టర్ హర్షి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పొగడదండ రవికుమార్

ఎఎంసి గోదాములు పరిశీలిస్తున్న మార్క్ఫెడ్ మేనేజర్

గోదాములు పరిశీలించిన మార్క్‌ఫెడ్ మేనేజర్

ప్రజాశక్తి - పర్చూరు

కలెక్టర్, మార్క్ఫెడ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు ఎఎంసి యార్డుల్లోని గోదాములను పరిశీలించినట్లు మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణ శ్రీ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డ్ లోని గోదాములను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ ఉత్పత్తులు నిలువ ఉంచడానికి అనుకూలంగా ఉన్నాయా లేదా అని పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. గోదాముల పరిస్థితి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రిపేర్లు ఉంటె చేయిస్తామని చెప్పారు. ఆమె వెంట ఎడిఎ మోహనరావు, ఎఒ రామ్మోహనరెడ్డి, ఎఎంసి కార్యదర్శి, టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు, శోభన్ బాబు, శ్రీనివాసరావు ఉన్నారు.

శుక్లంల ఆపరేషన్ కోసం బయలుదేరిన ప్రజలు

రోటరీ ఆధ్వర్యంలో శుక్లాల ఆపరేషన్లు

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శుక్లాల ఆపరేషన్ల కోసం పంగులూరు నుండి 40మంది బయలుదేరి వెళ్లినట్లు రోటరీ ఐ కేర్ రీజనల్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో గత శనివారం నిర్వహించిన కంటి పరీక్షల్లో 140 మందికి కంటి శుక్లంల ఆపరేషన్లు అవసరమని శంకర్ కంటి వైద్యశాల వైద్యులు తెలిపారు. వారిలో 100 మందిని రెండు బస్సుల్లో శంకర్ కంటి ఆసుపత్రికి తరలించి శుక్లంల ఆపరేషన్లు చేయించారు. ఇంకా 40 మంది మిగిలి ఉండటంతో వీరిని శంకర్ కంటి ఆసుపత్రికి బస్సులో మంగళవారం తరలించారు. వీరు శుక్లాంల ఆపరేషన్ చేయించుకుని గురువారం తిరిగి వస్తారని తెలిపారు. వీరందరికీ ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగానే ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు షేక్ కాలేషా వలి, మాజీ అధ్యక్షులు కరణం హనుమంతరావు, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ సుబ్బారెడ్డి

ఖరీఫ్ సాగుకి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పంగులూరు

రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించడం, అల్పపీడనం కారణంగా వర్షాలు కలవడం వల్ల ఖరీఫ్ వ్యవసాయం చేయడానికి రైతులు సిద్ధంగా ఉండాలని ఎఒ డి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని రామకూరు, బైట మంజులూరులో రైతులతో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ వ్యవసాయం పట్ల రైతుల్లో అవగాహన కలిగించారు. ప్రతి రైతు నాణ్యత కలిగిన, మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లు తీసుకొని దాచుకోవాలని అన్నారు. 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జీలుగా, జనుము విత్తనాలను రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్ చేయించుకుని తీసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ లో సాగర్ నీటిని విడుదల చేసిన వెంటనే వరి విత్తనాలతో నారుమల్లు వేసుకోవాలని అన్నారు.

సమయానికి రాక..

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ సిబ్బంది
- ప్రజలకు తప్పవని అవస్థలు
- పనుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయం

తాళం వేసి ఉన్న క్యాదర్శి గది

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

ఒక్క అధికారి కూడా ఆ కార్యాలయానికి సక్రమంగా రావడం లేదు. ప్రజలకు ఎలాంటి పనులూ కావడం లేదు.ఏదైనా పని కావాలన్నా..సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇది మండలపరిధిలోని ఉప్పుగుండూరు పంచాయతీలో నెలకొన్న దుస్థితి.

ఉప్పుగుండూరు మేజరు పంచాయతీ. వివిధ పనుల కోసం ప్రజలు నిత్యం వచ్చిపోతుంటారు. అధికారులు అందుబాటులో లేక పోవడం నిరాశతో వెనుదిరగాల్సి వస్తుంది. మంగళవారం మధ్యాహ్నం 1గంట సమయంలో జూనియర్ అసిస్టెంట్, కార్యదర్శి గదులకు తలుపులు వేసి ఉంది. కంప్యూటర్ ఆపరేటరు గది కాలి కుర్చీలతో దర్శనమిచ్చింది. వారు ఎప్పుడు వస్తారోనని వివిధ పనుల నిమ్మితం వచ్చివారు చెట్ల కింద పడిగాపులు కాశారు. ఇదే తంతు గత కొన్ని రోజులుగా జరుగుతోంది. కార్యదర్శి కిరణ్ కుమార్ సాధారణ సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జిగా ఎవరినీ నియమించలేదు.ఈ నేపథ్యంలో కంప్యూటర్ ఆపరేటర్ వెంకట్రావు కూడా సెలవుపై వెళ్లాడు. దీంతో జనణ,మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన లాగిన్ ఎవరి వద్ద ఉందో కూడా అంతుపట్టని విషయంగా మారింది. గత 20 రోజుల నుంచి గ్రామస్తులు లేట్ జనణ ధ్రువీకరణ పత్రాలు లేట్ మరణ ధ్రువీకరణ పత్రాల కోసం పంచాయతీ కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు.అదేవిధంగా పంచాయతీలో నమోదు కాని జనణ,మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన నోడ్యూ సర్టిపికెట్ కోసం ప్రదక్షణలు చేస్తున్నారు. ఈ క్రమంలో సెలవుపై వెళ్లిన కార్యదర్శి కిరణ్ కుమార్ శనివారం విధులకు హాజరయ్యాడు. సర్టిపికెట్‌లకు సంబంధించిన లాగిన్ తనవద్దకు చేరలేదని, దానికోసం ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన చెబుతున్నాడు.

లోపించిన సమన్వయం

గతంలో ఉప్పుగుండూరు పంచాయతీకి జిల్లాలోనే మంచి గుర్తింపు ఉందిజ 5 సార్లు ఉత్తమ పంచాయతీగా అవార్డు దక్కింది. పంచాయతీలో ప్రస్తుత పాలకవర్గం, అధికారుల మధ్య సమన్వయం లేదు. దీంతో పాలన గాడి తప్పింది.ప్రజలు వివిధ పనుల కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన వారికి ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు సమయపాలన పాటించడం లేదు. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో శ్రీరామ్మూర్తి కార్యదర్శిగా ఉన్న సమయంలో అవినీతి చోటు చేసుకుంది. దీనిపై రెండు పర్యాయాలు డిఎల్‌పిఒ పద్మావతి విచారణ జరిపారు. రూ.42 లక్షలు మేర అవినీతి జరిగినట్లుగా అధికారులకు నివేదిక ఇచ్చారు. అయినప్పటికీ రికవరీ చేయలేదు. మరోసారి మార్కాపురం డిఎల్‌పిఒ చేత ఈ ఘటనపై విచారణ జరిపించారు. ఈ క్రమంలో సర్పంచి దేవరకొండ జయమ్మకు చెక్ పవర్ పోయింది. ఆ అవినీతిలో తన ప్రమేయం లేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో మళ్లి చెక్‌పవర్ పొందారు. అప్పటి నుంచి సర్పంచి అధికారుల మధ్య వార్ నడుస్తోంది. దాంతో పాలన సక్రమంగా సాగక ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని అధికారులు సమక్రమంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : పీడీ

ప్రజాశక్తి-టంగుటూరు

గృహ నిర్మాణలను పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. టంగుటూరు మండల పరిధిలోని వెంకటాయపాలెం లేఅవుట్‌లోని గృహ నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు పూర్తి చేసుకొనేందుకు ప్రభుత్వం పిఎంఇవై 1.0 క్రింద ఎస్‌సి,ఎస్‌టి, బీసీ లబ్ధిదారులు అనందగా నగదు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి,ఎస్‌టిలకు రూ.75,000, బీసీ రూ.50,000 వంతున అందజేస్తున్నట్లు

గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోక పోతే వారికి ఇచ్చిన పట్టా రద్దు చేసి మరొకరికి ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసి డిఇ సత్యన్నారాయణ, ఎఇ బి. అవినాష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జరుగుమల్లి : మండల పరిధిలోని పైడిపాడు ఎస్‌సి కాలనీలో ని గృహ నిర్మాణాలను హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సీతారామ్‌సింగ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోలీసులు 'రాజ్యాంగ బద్ధంగా' పని చేయాలి

- మహిళ మీద దౌర్జన్యం చేసి వారిపైనే కేసు పెడతారా..!
- ఇది మంచి పద్ధతి కాదు
- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

పోలీసులు రాజ్యాంగబద్ధంగా పనిచేసి ప్రజలకు అండగా నిలవాలని, అలా కాకుండా మహిళ మీద దౌర్జన్యం చేసి వారి మీదే కేసు పెట్టడం దారుణమని మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. శింగరాయకొండలోని తన కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెనాలి ఘటన మర్చిపోక ముందే పోలీసులు జాళ్లపాలెం గ్రామంలో బలవంతంగా ఇంట్లోకి వెళ్లి మహిళపై దౌర్జన్యం చేయటం దారుణమన్నారు. దాన్ని సమర్థిస్తున్న జిల్లా పోలీసు అధికారుల తీరు కూడా కరెక్ట్ కాదన్నారు. ఇంట్లోకి వెళ్లి మహిళపై పోలీసులు దౌర్జన్యం చేసి వీరంగం సష్టిస్తే బాధితుల మీదే కేసులు నమోదు చేయటం ఎంత వరకూ కరెక్ట్ చెప్పాలన్నారు. మంత్రి కూడా ఘటనపై పూర్తిస్థాయి సమాచారం తెలుసుకొని మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు రాజ్యాగంగానికి విరుద్ధంగా ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం బాధా కరమన్నారు. మద్రిపూడి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా పోలీసులు అధికారులు ప్రెస్‌మీట్ పెట్టి ఆయనకు అనుకూలంగా మాట్లాడం సరికాదన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, ఎస్ఎస్ఎల్ నియోజకవర్గ నాయకులు చుక్కా కిరణ్ కుమార్, యనమల మాధవి, చొప్పర వెంకన్న, షేక్ కరీం, పి.శ్రీనివాసరెడ్డి, షేక్ అబ్దుల్లా, గాదంశెట్టి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చాతుర్యను అభినందిస్తున్న ఆర్ఐఒ సైమన్ విక్టర్

తమినేని చాతుర్యకు ఎన్‌టిఆర్ ట్రస్ట్ కళాశాలలో అడ్మిషన్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

2025 ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆర్ట్స్ హెచ్ఇసి గ్రూప్‌లో1000/980 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్యకు ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థలో అడ్మిషన్ లభించింది. ఈ మేరకు హైదరాబాద్ ఎన్‌టిఆర్ ట్రస్ట్ నుంచి ఆదేశాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంకు సాధించిన చాతుర్య ఎన్‌టిఆర్ రాష్ట్ర షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్న సంగతి తెలిసిందే. గత ఏప్రిల్ 15న నిర్వహించిన షైనింగ్ స్టార్ అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర మానవ వనరుల, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తమ్మినేని చాతుర్య ప్రతిభను, కుటుంబ నేపథ్యాన్ని దష్టిలో ఉంచుకొని ఆమె అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఎన్‌టిఆర్ ట్రస్ట్ కాలేజీలో అడ్మిషన్‌కు సిఫార్సు చేశారు. చాతుర్య తన లక్ష్యం అధిగమించేందుకు వీలుగా సివిల్ సర్వీస్‌తో కూడిన డిగ్రీ విద్యను ఉచితంగా అభ్యసించేందుకు జూనియర్ అండ్ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రవేశం కల్పిస్తూ ఎన్‌టిఆర్ ట్రస్ట్ నుంచి ఉత్తర్వులు కంభం ప్రిన్సిపల్‌కు పంపారు. మానవ వనరుల శాఖ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన సమాచార ఉత్తర్వులను తమ్మినేని చాతుర్యకు మంగళవారం ఆర్ఐఒ సైమన్ విక్టర్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి. తిరుమలయ్య, ఆర్. శిరీషకుమారి, బివి.శివలక్ష్మమ్మ, ప్రసన్న, డి.చందన పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : కడపలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం 4, 5వ తరగతుల్లో అడిషన్లు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.రాజరాజేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి లో ప్రవేశం కోసం 2015 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31లోపు జన్మించి ఉండాలన్నారు. ఒకటి నుంచి మూడు వరకు ప్రభుత్వ పాఠశాలలు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివిఉండాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31లోపు జన్మించి ఉండాలన్నారు. 1 నుంచి 4 వరకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో చదివి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు పంచాయతీ, మున్సిపల్, కార్పొ రేషన్ ఇతర సంస్థ దారా జారీ చేసిన పుట్టిన తేది ధ్రువ పత్రంతో ప్రభుత్వ క్రీడా పాఠశాలల వెబ్ సైట్‌లో ఈనెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20 నుంచి 25 వరకు ఆన్‌లైన్ లో వచ్చిన అప్లికేషన్స్ షార్ట్‌లిస్ట్ చేస్తారని తెలిపారు. అనంతరం జాబితా ప్రకారం జులై 1 నుంచి 3 వరకూ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపికలకు అన్ని ఒరిజనల్ పత్రాలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రకాశం జిల్లా, డిఎస్‌డిఒ 9121106840 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

9లోపు డిఎల్‌ఇడి ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : ప్రైవేట్ డిఎల్‌ఇడి (టిటిసి) మొదటి సంవత్సరం రెండో సెమిస్టరు పరీక్షలకు హాజరయ్యే 2024- 2026 రెగ్యులర్ విద్యార్థులు, 2023-2025, 2022-2024 విద్యా సంవత్సరాలలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈనెల 9 లోపు ఫీజు చెల్లించాలని మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. పెనాలిటీతో ఈ నెల 14 లోపు ఫీజు చెల్లించవచ్చుని తెలిపారు.

మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

ఫ్లోరోసిస్‌పై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

ఫ్లోరోసిస్ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గాజులపాలెం, కాకానిపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య అధికారులు గొట్టిపాటి జయసింహ, హేమామాధురి, అనిల్ కుమార్ సూచించారు. పట్టణంలోని ఆయా పిహెచ్‌సిల పరిధిలో ఆశా డే నిర్వహించారు. ఫ్లోరోసిస్ లక్షణాలు, వాటి వలన వచ్చే వ్యాధులు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్ బారిన పడిన వారికి వీల్ చైర్స్ తదితర పరికరాలు అందించారు. స్కూల్ పిల్లలకు వచ్చే నోటి సమస్యలు, ఫ్లోరోసిస్ సంబంధిత లక్షణాలు, విటమిన్ సి వల్ల వ్యాధిని అధిగమించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఎముకల్లో సంభవించే వ్యాధుల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పంగులూరు ఫీడర్ పరిధిలోని పంగులూరులో బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎఇ గోరంట్ల అనిల్ కుమార్ మంగళవారం తెలిపారు. పంగులూరు ఫీడర్లో మరమ్మత్తు పనులు జరుగుతున్నందున సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నగరం : నేడు 04న బుధవారం 33/11 కెవి ఉల్లిపాలెం సబ్ స్టేషన్‌లోని సజ్జవారిపాలెం ఫీడర్ మరమ్మతు కారణంగా సజ్జవారిపాలెం, ఉల్లిపాలెం పంచాయతీ, పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఎఇ ఎస్‌కె నాగుల్ మీరా తెలిపారు.

భట్టిప్రోలు : విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని భట్టిప్రోలులో బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శాంతకుమారి తెలిపారు.

అద్దంకి : సబ్ డివిజన్ పరిధిలో ఉదయం 08 నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు ఫీడర్లు మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. పట్టణంలో భవాని సెంటర్, మున్సిపల్ ఆఫీస్ రోడ్, బస్టాండ్ ఏరియా, బంగ్లా రోడ్డు, కాకాని పాలెం ప్రాంతం, కొరిసపాడు మండలంలోని సోమవరప్పాడు, పంగులూరు మండలం లోని పంగులూరుకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

డీలర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దారు సింగారావు

కార్డుదారులతో గౌరవంగా ఉండండి

ప్రజాశక్తి - పంగులూరు

రేషన్ కార్డు దారులపట్ల డీలర్లు గౌరవ మర్యాదలు పాటించాలని, వారి పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దారు పి సింగారావు అన్నారు. రేషన్ డీలర్లు, విఆర్‌ఒలు, రెవిన్యూ సిబ్బందితో మంగళ వారం సమావేశంలో నిర్వహించారు. 65 ఏళ్ల వయసు పైబడిన వారికి, వికలాంగులకు బియ్యం, పంచదార ఇంటి వద్దకే వచ్చి ఇస్తారని తెలిపారు. ప్రతినెలా 1నుండి 15 వరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల 8 గంటల వరకు కార్డుదారుడని చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ శ్వేత, 34 రేషన్ షాపుల డీలర్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

షెడ్లు నిర్మించారు..బిల్లుల సంగతేంటి?

• నాలుగు నెలలుగా పాడి రైతుల ఎదురు చూపు • బిల్లును చెల్లించండి రైతులు ఆవేదన

ప్రజాశక్తి - రేపల్లె

మినీ గోకులం పథకంలో షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. పాడి రైతులను ప్రోత్సహించి అధిక పాల దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు పథకం ప్రవేశపెట్టారు. పాడి పశువులు అధిక పాల దిగుబడి ఇవ్వాలంటే మంచి పరిశుభ్రమైన వాతావరణం ఉండాలనే ఉద్దేశ్యంతో వాటికి షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సంకల్పించింది. మినీ గోకులం షెడ్ల ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత ఉంటుందని భావించింది. ఈ పథకాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసింది. ఉపాధి హామీ నిధుల నుంచి షెడ్లకు డబ్బులు చెల్లించే విధంగా పథకాన్ని రూపొందించారు. పాడి పశువుల సంఖ్యను బట్టి మూడు రకాలుగా షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక చేసింది. రెండు పశువుల కోసం షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష, నాలుగు పశువుల కోసం రూ.1.50లక్షలు, ఆరు పశువుల కోసం రూ.1.80లక్షలు చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో పది శాతం రైతు వాటాపోను 90 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే విధంగా పథకాన్ని రూపొందించారు. రైతులు తమ వాటాగా పది శాతం డీడీల రూపంలో చెల్లించారు.

నిలిచిన ఉపాధి హామీ నిధులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లకు బిల్లులు మంజూరు కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఈ పథకానికి మంగళం పాడింది. దీంతో రైతులకు ఆసక్తి ఉన్నా నిర్మించుకోలేక ఇబ్బందిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆసక్తి

నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డు

ఉన్న రైతులకు గోకులం, గొర్రెల షెడ్లు మంజూరు చేసింది. దీంతో రైతులు పెద్దఎత్తున ముందుకొచ్చారు. రైతులు తమ వంతుగా పది శాతం సొమ్ము చెల్లిస్తే మిగిలిన యూనిట్ మొత్తాన్ని ప్రభుత్వం రాయితీపై నిర్మిస్తుంది. మొదట్లో షెడ్లు నిర్మించిన వెంటనే బిల్లులు మంజూరు చేసి అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. నాలుగు నెలల నుంచి చెల్లింపులు లేక ఇబ్బంది పడుతున్నారు. వెంటనే డబ్బు వస్తాదనే ఉద్దేశంతో అప్పులు తీసుకొచ్చి షెడ్లు నిర్మించారు. ఇప్పుడు బిల్లుల కోసం రోజూ ఎపిఒ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని గోకులం షెడ్లు నిర్మాణాలు చేసుకున్న పాడి రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో రూ.3కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది.

పది రోజుల్లో జమ చేస్తాం

నియోజకవరంలో గోకులం షెడ్ల నిర్మాణానికి 125 టార్గెట్ తీసుకోగా 168 మంజూరైనట్లు ఎపిఒ కె సుబ్బరాజు తెలిపారు. వీటిదులో 123 పూర్తి కాగా 14 రూఫ్ లెవెల్, 11 బేస్మెంట్ లెవెల్‌లో ఉన్నాయని తెలిపారు. షెడ్లకు సంబంధించిన బిల్లులు వారం పది రోజుల్లో పడే అవకాశాలు ఉన్నాయని, పాడి రైతులు అధైర్య పడవద్దని తెలిపారు.

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దనే సరుకులు అందించాలని రేపల్లె ఆర్డిఒ రామలక్ష్మి సూచించారు. ఐలవరంలో ఆకురాతి వెంకట సుబ్బారావుకు చెందిన 9వ నంబర్ రేషన్ దుకాణాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో తహశీల్దారు మేక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విఆర్వోలు, అంగన్వాడీలు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు రేషన్ షాపు లకు వెళ్లకుండా వారికి డీలర్లు అందిస్తారని సూచిం చారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణి కుమార్, ఎంపీడీఒ ఎస్ వెంకటరమణ, సిఎస్‌డిటి, విఆర్‌ఒ లక్ష్మి, డీలర్లు నరసింహారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : రేషన్ పంపిణీని రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి మంగళవారం కనగాలలో పరిశీలించారు. రేపల్లె సిఎస్ డిటి ఓంకార్, తహశీల్దారు పద్మావతి పాల్గొన్నారు.

కర్లపాలెం : దివ్యాంగులు, 65ఏళ్లు నిండిన వృద్ధులైన లబ్ధిదారుల ఇంటి వద్దకు డీలర్లు వెళ్లి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ఆర్డిఒ పి గ్లోరియా అన్నారు. పాల కేంద్రం వద్ద రేషన్ దుకాణంను ఆమె

భట్టిప్రోలులో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఒ రామలక్ష్మి

తహశీల్దారు సుందరమ్మ, ఎంపిడిఒ శ్రీనివాస్‌తో కలసి పరిశీలించారు.

వేటపాలెం : 65ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు తెచ్చి ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని చీరాల ఆర్డీఒ టి చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. మండలంలోని కొత్తపేటలో రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపు డీలర్స్ ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు పాలపర్తి పార్వతి, ఇన్చార్జి ఆర్ఐ కె నాగరాజు, విఆర్‌ఒ షేక్ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

తెలంగాణలో అద్దంకివాసుల అరెస్టుతో ఉలికిపాటు

ప్రజాశక్తి - అద్దంకి

యువత మత్తుకు అలవాటు పడి వారి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్న ఘటనలుగా కనిపిస్తున్నాయి. ధన దాహంతో సులభంగా డబ్బు సంపాదించవచ్చనే కోరికతో గంజాయి, ఇతర మత్తు పదార్థాల ఊబిలో పడి విలువైన సమయాన్ని, జీవితాన్ని జైలు పాలు చేసుకుంటున్నారు. గత రెండు రోజుల క్రిందట తెలంగాణలో అద్దంకి ప్రాంతానికి చెందిన ఒక ముఠా డ్రగ్స్ అమ్మకాలు జరుపుతుండగా అక్కడి అధికారులు అరెస్టు చేసినట్లు పాఠకులకు విదితయే. ఈపాటికే అద్దంకి ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాలేజీ విద్యార్థులు గతంలో గంజాయికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకున్న ఘటనలు ఉన్నాయి. అద్దంకి ప్రాంతానికి చెందిన ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగి డ్రగ్స్‌కు అలవాటు పడి అవి దొరక్కపోవడంతో గత నాలుగేళ్ల కిందట ఇంటిలో ఉరివేసుకొని మృతి చెందిన ఘటన ఉంది. పోలీసులు ఈ మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ చాప కింద నీరులా విద్యార్థులు వీటికి బానిసలై ఉన్నారని ప్రజలు అక్కడక్కడ చర్చించు కుంటున్నారు. ఇతర ప్రాంతాల నుండి అద్దంకి ప్రాంతానికి వచ్చిన యువత గంజాయి మత్తులో ఉన్నారని అక్కడక్కడ మాట్లాడు కుంటున్నారు.

డ్రగ్స్‌పై పోలీసుల అవగాహన కార్యక్రమాలు

డ్రగ్స్ వద్దు. జీవితం ముద్దు బ్రో విలువైనదని ఎన్నో అవగాహన కార్యక్రమాలు అనేక పర్యాయాలు అవగా హన సదస్సులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ యువ తలో మార్పు లేదని, ఇది చాప కింద నీరులా ప్రవహి స్తుందని, దీన్ని అరికట్టడం కోసం కఠిన చర్యలు తప్పవ ని పోలీసులు భావిస్తున్నారు. కళాశాల్లో అనేకసార్లు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం కేసుల్లో ఇరుక్కుంటే జీవితం నాశనం అవుతుందని తెలిపారు. అలాంటి సమాచారం తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో సిఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన నిర్వహించి ప్రజలకు వివరించారు.



ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి

పొగాకు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలపై రైతుల ఆందోళనలతోపాటు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. జూన్ రెండో వారం నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం మంగళవారం వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్‌తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. పొగాకు సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రిన్సిపల్ సెక్రెటరీతో ఫోన్లో మాట్లాడారు. పొగాకు కొనుగోలుకు శ్రీకారం చుట్టాలని కోరారు. రేపు క్యాబినెట్లో సైతం పొగాకుపై చర్చిస్తామన్నారు. మార్క్ ఫైడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సుముకుత వ్యక్తం చేసింది. ఇప్పటికే రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందించనున్నారు. పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు మార్కెట్ యార్డుల్లో మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోనుంది.

మండల స్థాయి యోగా శిక్షణ

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి యోగా శిక్షణ మంగళవారం ప్రారంభించారు. మూడు రోజులపాటు శిక్షణ జరుగుతుందని ఎంపిడిఒ జావేద్ తెలిపారు. యోగాతో ఆరోగ్యాన్ని పదిలపర్చుకోవచ్చని పంచాయతీ కార్యదర్శి కె శ్రీను తెలిపారు. శిక్షణ, పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉన్నత పాఠశాల పిడి సునీత, పూనూరు ఉన్నత పాఠశాల పిడి అంకమ్మరాజు వ్యవహరించారు.

కారంచేడు : రోజువారి యోగ చేయడం వలన శారీరకంగా మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపిడిఒ కె నేతాజీ చెప్పారు. స్థానిక రామానాయుడు ఇండోర్ స్టేడియంలో మండల స్థాయి యోగా పోటీలు ఆయుష్ డాక్టర్ ప్రదిప్ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ లింగిశెట్టి కృష్ణ, ఆదిపూడి, దగ్గుబాడు, జరుబుల వారి పాలెం సెక్రటరీలు పాల్గొన్నారు.

వెన్నుపోటు చరిత్ర జగన్‌దే..

ప్రజాశక్తి - బాపట్ల

కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచి మరీ వైసిపిని స్థాపించి అధికారంలోకి వచ్చిన వెన్నుపోటు రాజకీయ చరిత్ర జగన్మోహన్‌రెడ్డిదని తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సరగల రాజశేఖర బాబు అన్నారు. ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణానికి విధివిధానాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 20వేల కిలో మీటర్లు రహదారులు మరమత్తులు చేశామని అన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేలు వేట విరామ భృతి అందజేశామని తెలిపారు. చెత్త పన్ను రద్దు చేసామని అన్నారు. రూ.1470 కోట్లు గత ప్రభుత్వంలో రైతులకు ఇవ్వకపోతే టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నగదు చెల్లించామని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ మంచి ప్రభుత్వంగా ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందని తెలిపారు.

ఫిర్యాదులపై పరిశీలన

ప్రజాశక్తి యద్దనపూడి

మండలంలోని ఎనమదల పంచాయతీ కార్యదర్శి రాణి తనకు వచ్చిన ఫిర్యాదు అర్జీలపై మంగళవారం పరిశీలన చేశారు. తిరునవల్లి రామాంజనేయులు, ఇ రాములు తాము నివాసం ఉంటున్న రోడ్లో ఒకరికి ఒకరు ఇబ్బంది కలిగిస్తున్నారని తన ఫిర్యాదులు అందాయని, దానిపై విచారణ చేసినట్లు తెలిపారు. ఫిర్యాది దారుల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్య పరిశీలించారు. స్పందించిన ఆమె తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మురుగు నీరు సక్రమంగా వెళ్లే మార్గం చేయిస్తామని తెలిపారు.

ప్రజాశక్తి
బుధవారం 4 జూన్ 2025

మాట్లాడుతున్న షా బాషా

పర్యావరణాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి - బాపట్ల

చెట్లు పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని మయూఖ ఫామ్స్ ప్రాజెక్ట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షా బాషా అన్నారు. పట్టణంలోని ముస్లిం షాదీ ఖానాలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం కోరలు చాస్తోందని, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, ప్రకృతి వనరులు అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి వాటి ద్వారా ప్రకృతి సంపదను పరిరక్షించాలని అన్నారు. దాంతోనే పుడమిని పరిరక్షించగలమని అన్నారు. దినకోసం అవసరమైన సామాజిక వనరులను తామే సమకూరు స్తామని అన్నారు. వీటి ద్వారా ప్రకృతి పరిరక్షణతో పాటు ఆదాయ వనరులు సమకూరుతాయని అన్నారు. ప్రజలు సహకరిస్తే తరుము కొస్తున్న కాలుష్యం బారి నుండి ప్రజలను కాపాడగలమని అన్నారు అందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నాగార్జునరెడ్డి, రియల్ ఎస్టేట్స్ సంఘం నాయకులు పిండిమర కృష్ణ, షేక్ రిహానా పాల్గొన్నారు.

గొట్టిపాటి సహకారంతో నిధులు మంజూరు

ప్రజాశక్తి - పంగులూరు

గద్దం హనుమంతరావు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకా రంతో మండలంలో పలు అభి వృద్ధి పనులకు నిధులు మంజూ రు అయ్యాయి. మండలంలోని చందలూరు జెడ్పి ఉన్నత పాఠశాల్లో భోజనశాల నిర్మాణా నికి జెడ్పి నిధుల నుండి రూ.35 లక్షలు, పంగులూరు బీసీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.10 లక్షలు, పంగులూరు - కోటపాడు గ్రామాల మధ్య గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, ముప్పవరంలో సిసి రోడ్డు, సైడ్ డ్రైన్స్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు అయ్యాయి.

డిఎంఎఫ్ నిధులు రూ.1.50కోట్లు మంజూరు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రోడ్ల నిర్మాణానికి డిఎంఎఫ్ నిధులు రూ.1.50కోట్లు మంజూరై నట్లు పంచాయతీరాజ్ ఎఇ గద్దం హనుమంతరావు తెలిపారు. కొండమూరులో సిసి రోడ్డు, డ్రైన్స్ నిర్మాణానికి రూ.15 లక్షలు, జాగర్లమూడి వారి పాలెంకు రూ.15 లక్షలు, కోటపాడుకు రూ.20 లక్షలు, జనకవరంకు రూ.10 లక్షలు, ఆరికట్లవారిపాలెంకు రూ.20 లక్షలు, బూదవాడకు రూ.20 లక్షలు, కొండ మంజులూరుకు రూ.15 లక్షలు, బైట మంజులూరుకు రూ.15 లక్షలు, అలవలపాడుకు రూ.10 లక్షలు, భగవాన్ రాజుపాలెంలో ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

మాట్లాడుతున్న అంగనవాడీ లీడర్ ఎ బ్యూలా

నాయకత్వ లక్షణాలను గుర్తించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

కిశోర బాలికల్లో దాగివున్న నాయకత్వ లక్షణాలు తమలో తాము గుర్తించాలని అంగన్వాడి సెక్టార్ లీడర్ కార్యకర్త ఏ బ్యూలా అన్నారు. మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరి పట్నం బోరయ్య కాలనీ అంగన్వాడి కేంద్రం నందు కిశోర వికాసం వేసవి శిక్షణలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కె లక్ష్మి, నిర్మల, రఘువర్ధిని, విఒఎ మాధవిపాల్గొన్నారు.

హోంమంత్రి అనిత వ్యాఖ్యలు చట్టవిరుద్ధం

ప్రజాశక్తి - అద్దంకి

నిరసన తెలుపుతున్న నీలం నాగేంద్రరావు

హోం మంత్రి అనిత తెనాలి దళిత యువకులపై పోలీసు అధికారులు చేసిన రాజ్య హింసపై కూటమి ప్రభుత్వం చేసిన కుట్ర పూరిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధం, రాజ్యాంగ వ్యతిరేకమని నీలం నాగేంద్రరావు మండిపడ్డారు. తెనాలిలో దళిత యువకులపై జరిపిన తాలిబన్ తరహా కూటమి ప్రభుత్వ ఖాకీ ధమనకాండపై స్థానిక అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ తెనాలి దళిత యువకులపై స్థానిక మంత్రి నాదెండ్ల మనోహర్ కుట్ర పూర్వకంగా జరిపించిన పోలీసు అనాగరిక దాడి అన్నారు. మూడు నెలల క్రితం తెనాలి ఐతా నగర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని పోలీసులు మున్సిపల్ అధికారులచే అధికార బలంతో తొలగించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఎంఎల్ఎ, మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రయత్నించారని అన్నారు. తెలుగుదేశంకు చెందిన రఘు రామ కృష్ణరాజును ఆనాటి ప్రభుత్వం బహిరంగంగా నడిరోడ్డుపై కాకుండా సిబిసిఐడి కార్యాలయంలో అరికాళ్ళ కొటింగ్ ఇస్తే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఘటనకు బాధ్యుడిని చేస్తూ డీజీపీ హోదాలో ఉన్న పివి సునీల్ కుమార్‌ను ఎందుకు సస్పెండ్ చేశారని అన్నారు. కావున నేరానికి పోలీసు శిక్షలకు కులం ఉంటుందని హోం మంత్రి అనిత తెలుసుకోవాలని అన్నారు. తెనాలి దళిత యువకులపై ఖాకీ దాష్టీకం చేసిన తెనాలి సిఐలు రాములు నాయక్, రమేష్ బాబును ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం అరెస్టు చేయాలన్నారు. తెనాలి దళిత యువకులపై కుట్ర పూర్వక ఖాకీ దాడి జరిపించిన సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ గురువు నాదెండ్ల మనోహర్‌ను మంత్రివర్గం నుండి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షులు అంకం కిరణ్ కుమార్, కాకుమాను రవి, యానాది సేవా సమితి నాయకులు పోలా జీవరత్నం, ఆదినారాయణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు యోహాన్, అంబేద్కర్ పోరాట వేదిక కన్వీనర్ ఎర్రమల శ్రీనివాసరావు, గొడ్డటి రవి కిరణ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాకు జగన్ పితామహుడు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

గంజాయి వ్యాపారులు, డ్రగ్ డీలర్లు, బ్లేడ్ బ్యాచ్‌లకు జగన్ గౌరవ అధ్యక్షుడిగా నియమిస్తే బాగుంటుందే మోనని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఎద్దేవా చేశారు. గంజాయి మాఫియా, రౌడీ షీటర్లను ఇటీవల తెనాలిలో పోలీసులు చేతిలో దెబ్బలు తిన్న ముగ్గురు రౌడీ మూకలను జగన్మోహన్ రెడ్డి పరామర్శించడం పట్ల ఆనందబాబు అభ్యంతర వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మడం, ఆడపిల్లలను వేధించడం నేరం కాదన్నట్లుగా జగన్ మాటలు ఉన్నాయనీ, గతంలో మతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టారనీ ఇప్పుడు కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని జగన్ వైఖరిపై దుయ్యబట్టారు. ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని ప్రజలంటే జగన్‌కు కోపం రోజురోజుకూ పెరిగిపోతోందని అన్నారు. ప్రజల పట్ల జగన్మోహన్ రెడ్డికి విపరీతమైన అసహ్యం కలుగు తోందని అన్నారు. ఐదేళ్ళ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తి రౌడీ షీటర్లు, చైన్ స్నాచర్లు, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి వ్యాపారులకు మద్దతు ఇవ్వడం ఏమిటి? సభ్య సమాజం ఏమనుకుంటుందనే కనీస ఆలోచన జగన్‌కు లేదనీ ఆగ్రహాం వ్యక్తం చేశారు. సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలని అకుంటు న్నాడని, జగన్‌కు రాజకీయ భవిష్యత్తు లేదనీ, ప్రజాసేవకు పనికిరాడని అన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజును పోలీసులు కిరాత కంగా వేధించారని, ఇసుక దందా గురించి ప్రశ్నించిన వరప్రసాద్‌ను పోలీస్ స్టేషన్‌లో శిరోముండనం చేసి అవమానించారని అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి శవాన్ని డోర్ డెలివరీ చేసినా ఆ కేసు పట్టించుకోలేదని అన్నారు.

చీరాల : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను, ఆపార్టీని ప్రజలు భూస్థాపితం చేసి 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని తెలుగు యువత నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ అన్నారు. స్థానిక టిడిపి కార్యలయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో సూచనలతో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదమని అన్నారు. రాష్ట్రంలో అసలైన వెన్నుపోటు దారుడు జగనేనని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో అరాచకాలు, ఎన్నో వేధింపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రోడ్లు, మౌళిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళతుంటే ప్రజలు ఆశీర్వది స్తున్నారని వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు వీరభద్రయ్య, ఎంపీ చైర్మన్ జనార్దన్, గంజి పురుషోత్తం, గుమ్మా వెంకటేష్, పూర్ణ, జాగ్రత్తని పోతురాజు, పులి వెంకటనారాయణ, తేల్రోలు నాగేశ్వరరావు, బాలచంద్ర , చప్పిడి వెంకట్రావు, కర్నేటి శ్రీను, వెంకటేశ్వరరావు, లింగమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌరి అమర్నాథ్

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రతి కార్డుదారునికి డీలర్లు రేషన్ సరుకులు సక్రమంగా అందజేయాలని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బంది, సెక్రటరీలకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. 65ఏళ్ల దాటి ఒంటరిగా ఉండే వృద్దులు, దుకాణాల వద్దకు రాలేని వికలాంగులకు తప్పకుండా రేషన్ డీలర్ వారి ఇళ్లకు వెళ్లి సరుకులు అందించాలని అన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ నాగేశ్వరరావు కన్నుమూత

ప్రజాశక్తి - బాపట్ల

నాగేశ్వరరావు (67)

సీనియర్ ఫోటోగ్రాఫర్, జర్నలిస్టు బాపట్లకు చెందిన గగ్గూరి నాగేశ్వరరావు (67) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో మృతి చెందా రు. నాగేశ్వరావు ఇటీవల అనా రోగ్యానికి గురి కావడంతో హైదరాబాదులో ఆయన కుమా ర్తె ఇంటి వద్ద ఉంటున్నారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స అనంతరం కుమార్తె వద్దనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు దశాబ్ద లుగా ఫోటో గ్రాఫర్‌గా బాపట్లలో స్థిరపడిన నాగేశ్వరరావు అనేక కార్యక్రమాలతో పాటు రాజకీయ నాయకుల ఫోటో లు పత్రికలకు అవసరమైన ఫోటోలను విలేకరులకు అంద జేసేవారు. అందరికి సుపరిచితులైన నాగేశ్వరరావు మృతి ఫోటోగ్రఫీ రంగానికి తీరని లోటని పలువురు ఫోటోగ్రాఫర్లు పేర్కొన్నారు. నాగేశ్వరరావు మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆతని మృతికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు గంట అంజిబాబు, జనసేన నాయకులు నామ న వెంకట శివన్నారాయణ, ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు, పలువురు జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని మంగళవారమే బాపట్లకు తరలించారు. బుధవారం బాపట్లలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

డ్రగ్స్ వినియోగిస్తే చర్యలు

ప్రజాశక్తి - అద్దంకి

యువత భవిష్యత్తు, కుటుంబ జీవితాలను హరిస్తున్న గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఈగల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై గోడ పత్రికను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరగడం, విద్యా ర్థులు, యువత వాటి బారిన పడటం ఆందోళనకర మని పేర్కొన్నారు. తల్లి, దండ్రులు తమ పిల్లల అలవాట్లు, కదలిక లపై జాగురూకతతో వ్యవహరించాలని చెప్పారు. చెడు మార్గాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మానసికంగా తీవ్రంగా బలహీన పడిపోతారని అన్నారు. భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. ఇటువంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు పదార్థాలు సరఫరా చేసినా, అమ్మినా, సేవించినా చట్టపరమైన శిక్షలకు గురవుతారని తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - చీరాల

రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని విజయనగర కాలనీ ముఖద్వారం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. సుమారు 65ఏళ్ల వృద్ధుడు రైలు ప్రమాదానికి గురై ట్రాక్ వద్ద మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. మృతుడు కాలనీ వాసి కాదని, బయట వ్యక్తిగా భావిస్తున్నారు. రైలులో ప్రయాణి స్తూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడా? లేక పట్టాలు దాటు తుండగా ప్రమాదానికి గురయ్యాడా? అనే విషయంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుని పూర్తి వివరాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. మృతుడు తెల్ల చొక్కా, తెల్ల ప్యాంటు ధరించి ఉన్నారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.

నేడు వెన్నుపోటు దినం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏడాది కాలంలో ఏ ఒక్కటి అమలు చేయకుండా మోసం చేసిందని వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్ పేర్కొన్నారు. వైసిపి రాష్ట్ర పిలుపు మేరకు నేడు నిరసన తెలిపేందుకు కార్యకర్తలు, నాయకులు కదిలి రావాలని కోరారు.

పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్ష

ప్రజాశక్తి-శింగరాయకొండ

సమీక్షలో సిఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్న దామచర్ల సత్య

రాష్ట్రంలో పోర్టులు ఫిషింగ్ హార్బర్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్ధన్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో మంగళవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పోర్టుల గురించి, అక్కడ పనులు జరుగుతున్న పనితీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో ద్వారా సమీక్ష నిర్వహించారు. 'పనులు ఎంత మేర అయ్యాయి.. ఆ పనులు ఎప్పుడు పూర్తవుతాయి..' అనే విషయాలపై అధికారులతో చర్చించారు. నెల్లూరు జిల్లా, రామాయపట్నం పోర్టుకు సంబంధించి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ద్వారా అడిగి తెలుసుకున్నారు. పనులు దాదాపు పూర్తయ్యాయని సత్య వివరించారు. నూతనంగా నిర్మాణం చేపట్టబోయే ఫిషింగ్ హార్బర్లపై దామచర్ల సత్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

నాన్‌క్యాడర్ ఎస్‌పిగా అశోక్‌బాబు

అభినందించిన ఎస్‌పి ఏఆర్.దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్పీకి మొక్క అందజేస్తున్న అశోక్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా పోలీస్ శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న ఎంఎస్ఎస్ అశోక్‌బాబు నాన్ క్యాడర్ ఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్‌ను అశోక్‌బాబు మర్యాదపూర్వకంగా కలసి మొక్కను బహూకరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎస్‌పి దామోదర్ ఎఆర్ నాన్‌క్యాడర్ ఎస్‌పి అశోక్‌బాబు షోల్డర్ ప్యాడ్‌కు స్టార్ చిహ్నాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతి పొందడం గొప్ప విషయమన్నారు. పోలీస్ శాఖలో అశోక్‌బాబు చూపిన అంకితభావం, నిబద్ధత, అత్యుత్తమ సేవలకు ఈ పదోన్నతి ఒక సరైన గుర్తింపు అని తెలిపారు. ఈ ఉద్యోగోన్నతిని సద్వినియోగం చేసుకుంటూ, నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రముఖ పాత్ర వహించాలన్నారు. విధి నిర్వహణలో మరింత అకింతభావంతో సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందించాలన్నారు. ఎంఎస్ఎస్ అశోక్‌బాబు భవిష్యత్తులో మరెన్నో మైలు రాళ్లు అధిగమించాలని ఆకాంక్షించారు.

హరిత శోభితంగా ప్రకాశం జిల్లా

- పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి
- కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

హరిత శోభిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా పెద్దఎత్తున ముక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. సంబంధిత శాఖలు సమన్వయంతో వివిధ వర్గాలను ఇందులో భాగస్వామ్యం: చేయాలన్నారు. ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'వనం- మనం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ధేశించిన నేపథ్యంలో జిల్లాలో ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక వన విభాగం డిఎఫ్ఒ రాజశేఖర్ మాట్లాడుతూ ఈనెల 5న ప్రకాశం జిల్లాలో 4 లక్షలా 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. జూన్ నుంచి నవంబర్ వరకు 6 నెలల వ్యవధిలో జిల్లాలో 35 లక్షలా 75 వేలకు పైగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస రావు, ఉద్యాన అధికారి వైఎన్ఎస్ఎస్ గోపి చంద్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాఘవరెడ్డి, డ్వామా ఏపీడీ వండర్ మాన్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటికెళ్లి.. రేషన్ పంపిణీ

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

రేషన్ అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు నగరంలోని రేషన్ కార్డుదారునికి సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ నిత్యావసర సరుకులు మంగళవారం నాడు పంపిణీ చేశారు. నగరంలోని రేషన్ షాపు నెంబర్ 0881032 పరిధిలోని రేషన్ కార్డుదారుని ఇంటికి జెసి స్వయంగా వెళ్ళి రేషన్ అందజేశారు. సంయుక్త కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరా శాఖాధికారి ఎస్.పద్మశ్రీ, ఒంగోలు తహశీల్దార్ మధుసూదనరావు, పౌర సరఫరా శాఖ అధికారులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎం ప్రమోషన్'లో కమిషనరేట్ నిర్లక్ష్యం

- ఒకరికి ఇచ్చిన పోస్టుకు మరొకరికి ఆప్షన్ అవకాశం..
- ఆప్షన్ ఇచ్చిన వారికి మొండిచేయి..
- చేతులెత్తేసిన విద్యా శాఖ
- అభ్యర్థులకు న్యాయం చేయాలని యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

స్కూల్ అసిస్టెంట్ నుంచి పిఎస్ హెడ్ మాస్టర్ల ప్రమోషన్ ప్రక్రియలో కమిషనరేట్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఒకే చోట ఒకే పోస్టులో ఇద్దరు ఉపాధ్యాయులకు ప్రమోషన్ అవకాశం కల్పించేలా నిర్లక్ష్యం వహించిన కారణంగా, ముందుగా ప్రమోషన్ పొంది పోస్టులో జాయిన్ అయిన వారు పోస్టు దక్కించుకోగా, ఖాళీగా ఉన్నపోస్టుకు ఆప్షన్ పెట్టుకున్న ఉపాధ్యాయని ప్రమోషన్ ఉత్తర్వులు జనరేట్ కాక, గతంలో పనిచేసే చోట పోస్టు లేక, ప్రమోషన్ లభించక వేకెన్సీ కోసం చూసే పరిస్థితి ఎదురైంది.

వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని లింగసముద్రం మండలం వెంగళాపురం ఎంపిపిఎస్ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ గా పనిచేస్తున్న దివి కోటేశ్వరరావు మే 30, 31న నిర్వహించిన ఆన్ లైన్ ప్రమోషన్ ప్రక్రియ లో సీనియారిటీ జాబితా ప్రకారం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో ని ఇస్కాలవారివీధి ఎంపిపిఎస్ కు పిఎస్ హెచ్‌ఎంగా ప్రమోషన్ పొంది, ఆన్ లైన్ పద్ధతిలో ప్రమోషన్ ఉత్తర్వులు అందుకున్న ఆయన మరునాడు ఆ పాఠశాలలో జాయిన్ అయ్యారు. ఈ నెల రెండున కాగా ఖాళీగా ఉన్న పిఎస్ హెచ్‌ఎం పోస్టుల కోసం అర్హులైన వారిని వెబ్ ఆప్షన్ లు పెట్టుకోమని విద్యాశాఖ కమిషనరేట్ సూచించి, సీనియరిటీ జాబితా కూడా రూపొందించింది. దివి కోటేశ్వరరావు తో భర్తీ చేసిన హెడ్ మాస్టర్ పోస్టు ను ఆన్ లైన్ ఖాళీల నుంచి తొలగించకుండా ఖాళీగా ఉన్నట్లు ఆన్ లైన్ లో (వెబ్)లో చూపారు. విషయం తెలియని గుడ్లూరు మండలం దారకానిపాడు ఎంపియుపి స్కూల్ లో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఇంటూరి జ్యోతి సదరు స్కూల్‌లో హెచ్ ఎం పోస్టు ఖాళీగా ఉందని భావించి సోమవారం రాత్రి (గత రాత్రి) ఆప్షన్ పెట్టుకున్నారు. ఆమెకు కూడా ఆన్‌లైన్‌లో ప్రమోషన్ ఆర్డర్ జనరేట్ అయింది. తీరా మంగళవారం నాడు ఆ ఉపాధ్యాయిని జాయిన్ అయ్యేందుకు ఇస్కాలవారివీధి పాఠశాలకు వెళ్లగా అప్పటికే ఆ పాఠశాలలో కోటేశ్వరరావు జాయిన్ అయిన విషయం గుర్తించిన జ్యోతి ఒంగోలు డిఇఒ ఎ.కిరణ్ కుమార్‌ను ఆశ్రయించారు. ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయి, దారకానిపాడులో స్కూల్ అసిస్టెంట్ పోస్టు కోల్పోయి, ఇక్కడ ప్రమోషన్ దక్కక తన సమస్య ను పరిష్కరించాలని అధికారులను కోరారు.

చేతులెత్తేసిన విద్యా శాఖ..

జ్యోతి విషయం పలు దఫాలు ఉపాధ్యాయ సంఘ నేతలు అధికారులతో చర్చలు జరిపారు. డిఇఒ కిరణ్ కుమార్ విద్యా శాఖ కమిషనరేట్ అధికారులతో రాత్రి వరకు చర్చించారు. ఐటి విభాగం రాష్ట్ర భాద్యునితో చర్చించే ప్రయత్నం కూడా ఫలించలేదు.

విద్యాశాఖ చేసిన తప్పును సరిచేయాలి: యుటిఎఫ్

రాష్ట్ర విద్యా శాఖ చేసిన తప్పు కు విద్యా శాఖ భాద్యత వహించి సరిచేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఆఎ లైన్ ప్రక్రియలో ఐటి శాఖ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని, విద్యాశాఖ వైఫల్యం వల్ల జరిగిన పొరపాటును సరిచేసి జ్యోతికి న్యాయం చేయాలని యుటిఎఫ్ నాయకులు డిఇఒ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. డిఇఒను కలసిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు,అధ్యక్ష కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై,డి వీరాంజనేయులు,గౌరవాధ్యక్షులు ఎస్ రవి తదితరులు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తితో వ్యవహరించండి

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్రికెట్ ఆడుతున్న ఎస్‌పి దామోదర్

గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో నిరంతరం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందిలో ఉత్సాహం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పెరేడ్ గ్రౌండ్ లో ఒంగోలు, దర్శి, మార్కాపురం, కనిగిరి, ఆర్మ్‌డ్ రిజర్వ్, స్వాట్ టీమ్, ఐటి కోర్ 7 జట్లకు నిర్వహిస్తున్న ఎస్.పి ట్రోఫీ క్రికెట్ టోర్నీను ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాటింగ్ చేసి పోలీసులలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందుతుందన్నారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది క్రీడలతో ఒత్తిడి నుండి బయటపడవచ్చున్నారు. క్రికెట్ కేవలం క్రీడ మాత్రమే కాదని గ్రహించాలని, జట్టును నాయకత్వ లక్షణాలతో నడిపించడానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, పోరాట పటిమ వంటి వాటిని పెంపొందించుకోవడానికి సహకరిస్తుందన్నారు. పోలీసులు ప్రజల సేవలో ఎప్పుడూ ముందు ఉంటారని, అదే సమయంలో వ్యక్తిగత ఆరోగ్యంపైనా శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ మ్యాచ్‌లలో ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన చేస్తూ, జట్టు సమన్వయం, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఎస్‌పి ట్రోఫీలో పాల్గొంటున్న పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్‌పి తెలిపారు. టోర్నమెంట్ లో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి అశోక్‌బాబు, డిఎస్‌పిలు ఆర్. శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, శ్రీనివాసరావు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త గొల్లపాలెంలో అభివృద్ధి పనులు వేగవంతం

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

చిన్నగంజాం మండలం, కొత్తగొల్లపాలెం గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో అభివద్ధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ ఒకటవ తేదీన నిర్వహించిన పి4 కార్యక్రమంలో భాగంగా ఎంపిక కాబడిన కొత్త గొల్లపాలెం గ్రామంకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులకు ఆదేశించారు. ఆ గ్రామంలో ప్రజలు కోరిన సదుపాయాల గురించి వాటి పురోగతిపై ఆయన అధికారులను ఆరా తీశారు. గృహ నిర్మాణాల కోసం 42 మంది, ఇళ్ల స్థలాల కోసం 13 మంది దరఖాస్తు చేసుకున్నారని వారికి పొజిషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశామని చిన్నగంజాం తహసిల్దార్ జె.ప్రభాకర్ కలెక్టర్‌కు వివరించారు. గహ నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేశామని గృహ నిర్మాణ సంస్థ అధికారి వై వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో 17 మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని, వాటిలో రెండు పూర్తి చేశారని, మిగిలిన పనులు జరుగుచున్నాయని, 304 కుళాయి కనెక్షన్లను జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని, గ్రామంలో 131 సోక్ పిట్స్ మంజూరైనాయని ఆ పనులన్నీ జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో 4.48 కిలోమీటర్ల అంతర్గత సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు కోసం నిధులు మంజూరయ్యాయని, ఈ పనులను త్వరలో ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, గహ నిర్మాణ సంస్థ అధికారి వై వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, పీడీ డ్వామా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏపీ సీపీడీసీఎల్ ఈఈ మల్లిఖార్జున రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దెబోరా, చిన్నగంజాం తహసిల్దార్ ప్రభాకర్, వీక్షణ సమావేశం ద్వారా సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.